క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



న్యూశాయంపేట : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో ఈనెల 27న హైదరాబాద్ నాంపల్లి జీటీఓ భవన్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను మంగళవారం హనుమకొండ డీఎండబ్ల్యూఓ గౌస్ హైదర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఓ సెంట్రల్ ఉమెన్స్ వింగ్ అడిషనల్ చైర్‌పర్సన్ కొత్త శ్రీప్రియ (ఏఓ అగ్రికల్చర్), పవిత్ర (ఏఈఈ ఇరిగేషన్), టీజీఓ వైస్ ప్రెసిడెంట్ మంజుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నంది హిల్స్, జూ పార్కు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, లష్కర్ బజార్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

పాఠశాలలో నాటిన మొక్కలు



కాజీపేట : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పూర్వ విద్యార్థి సంఘం బాధ్యులు విరివిగా మొక్కలు నాటారు. మాజీ కేంద్రమంత్రి పుంజాల శివశంకర్ జ్ఞాపకార్థం రాష్ట్ర నాటక రంగ అకాడమీ చైర్మన్ పుంజాల అలేఖ్య మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త ప్రకాష్, ఉద్యానవన శాఖ అధికారి రమేష్, రవి, సంపత్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్, ఈద్గా అభివృద్ధికి సహకరించాలి



తహసీల్దార్ ఇక్బాల్‌ను కలిసిన ఎంఏ జబ్బార్

ఖిలా వరంగల్ : మండల పరిధిలోని ఖబ్రస్తాన్లు, ఈద్గాల అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎంఏ జబ్బార్ కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఇక్బాల్‌ను మంగళవారం మండల ముస్లిం ప్రతినిధులతో కలిసి జబ్బార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే పీఏసీఎస్ అధ్యక్షుడు కేడల జనార్దన్, మాజీ కార్పొరేటర్ పద్మ తహసీల్దార్ ఇక్బాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దారును కలిసిన వారిలో ఎండీ.చాంద్‌పాషా, మీర్జా హసన్ బేక్ , సురేష్, కిషన్, మాషూక్, సొసైటీ డైరెక్టర్ నర్సయ్య, కృష్ణ, కర్ణాకర్, కుమార్, చరణ్ ఉన్నారు.

ప్రతీ బిడ్డకు పౌష్టికాహారం అందించాలి

ఖిలా వరంగల్ : ప్రతీ బిడ్డకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. వరంగల్ 42వ డివిజన్ ఆదర్శనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అనితజ్యోతి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రమాదేవి హాజరై మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం, ఆటపాటలతో చక్కటి విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

హసన్‌పర్తి : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కిట్స్ స్టూడెంట్స్ యాక్టివిటీ సెంటర్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అదనపు పాఠ్యాంశాలు, కరిక్యులం కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ క్లబ్‌ల విద్యార్థి ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఎస్.సమిత(పీఎంసీ క్లబ్), జి.సాయి సుమంత్(హ్యూమానిటీక్లబ్),పి.వైష్ణవిరెడ్డి(సీపీక్లబ్), టీ.సాయిచరణ్ (ఎన్ఎస్ఎస్ క్లబ్),ఎస్. శివదీపక్ (డిస్కోక్లబ్),జి.సరయు(స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌క్లబ్),టి.కార్తీక్, విశాల్ ఆదిత్య(టెక్నికల్ క్లబ్),కె.శశికాంత్,పి.శ్రీతేజ(లిటరరీ క్లబ్)లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎం. శ్రీలత, అసోసియేట్ డీన్ ఎం. నరసింహారావు, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

కాలనీల్లో వీధికుక్కల సంచారం

- రోడ్లపై వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- పిల్లలను బెదిరిస్తున్న శునకాలు
- పట్టించుకోని అధికారులు

ఖిలా వరంగల్ : వరంగల్ 43వ డివిజన్ గణేశ్‌నగర్, 39వ డివిజన్ విద్యానగర్‌కాలనీ కాయిత బ్రాహ్మణ వీధితో పాటు పలు కాలనీల్లో వీధి కుక్కల సంచారమే అధికంగా కనిపిస్తాయి. వీటి సంఖ్య నానాటికి పెరగుతోంది. చీకటి పడితే ఎవరిపై దాడి చేస్తాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఆ డివిజన్లలోని ఏ వీధి చూసినా వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రి 9 గంటల దాటిన తర్వాత వీధుల్లోకి రావడానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. మహానగరపాలక సంస్థ వీధికుక్కల నియంత్రణ విభాగం కుక్కల శస్త్ర చికిత్సలకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా నియంత్రణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. కొద్దికాలంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కుక్క కాటుతో వచ్చే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. రాత్రి సమయాల్లో వాటి అరుపులకు నిద్ర పట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. బాటసారులనే కాదు. వాహనదారుల వెంట పడి, వారిని వాహనాల మీద నుంచి కింద పడేసి, కరిచిన సంఘటనలు కోకొల్ల లు. కాలనీల ప్రజలు రాత్రి సమయాల్లో కర్ర వెంట పెట్టుకుని రోడ్డుపైకి వస్తున్నామని ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కల నియంత్రణపై సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యానగర్ కాయితబ్రాహ్మణ వీధిలో తిష్టవేసిన వీధి కుక్కలు



43వ డివిజన్ గణేశ్‌నగర్‌లో కుక్కల గుంపు

నియంత్రణ చర్యలు నామమాత్రమే



కాలనీల్లో వీధికుక్కల బెడద రోజు రోజుకూ పెరిగిపోతుంది. నియంత్రణ చర్యలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. రాత్రి సమయాల్లో సమస్య ఎక్కువగా ఉంటోంది. రోడ్డుపై వెళ్తున్న వారిపై ఆకస్మికంగా దాడిచేయడంతో వాహనచోదకులు వాహనాలపై నుంచి పడి గాయపడుతున్నారు.

– మడూరి సోమయ్య, గణేశ్‌నగర్‌కాలనీ కార్యదర్శి

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- సీఐ శ్యాంసుందర్

విద్యారణ్యపురి : మానవ అక్రమ రవాణాను అరికట్టాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సీఐ శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్రమ రవాణా నాలుగు రకాలుగా ఉంటుందన్నారు. మత్తుపదార్థాలను రవాణా చేయటం, మానవుల అవయవాలను రవాణా, యువతులను, మహిళలను తరలించటం, సైబర్ నేరాలద్వారా అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేయడం లాంటివి ఉంటాయన్నారు విద్యార్థి దశలోనే అవగాహన కలిగి ఉండాలని ఇలాంటి వాటిపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్యాంసుందర్

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయభాస్కర్

హసన్‌పర్తి : అధిక వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని సీతంపేటలో మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వానాకాలంలో వరి, పత్తిలో వచ్చే వివిధ చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి వివరించారు.శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ విశ్వతేజ, అభ్యుదయ రైతు ఆదిరెడ్డి, మల్లారెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

దిగుమంతి సుంకాన్ని పునరుద్ధరించాలి

న్యూశాయంపేట : భారత ప్రభుత్వం పత్తిపై ఎత్తివేసిన 11 శాతం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్) వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మైదం పాణి అన్నారు. మంగళవారం ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన యూరియాను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ విశ్వప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు రైతాంగంపై కక్షపూరిత వైఖరిని అనుసరిస్తున్నాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ధారలింగన్న, గణిపాక సుధాకర్, సాబీరీ కాని మోహన్, ప్రభాకర్, బి.నర్సింహారావు తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గేదేలే..!

గూడ్స్ అండ్ సేల్స్ ట్యాక్స్‌పై వ్యాపారుల దాటవేత

- కేంద్రం నిర్ణయించినా అమలు చేయని వైనం
- కొత్త స్టాక్ వచ్చాకే ధరలు తగ్గిస్తామంటున్న వ్యాపారులు

సాక్షి, వరంగల్: వంట సామగ్రి నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు గూడ్స్ అండ్ సేల్స్ ట్యాక్స్ (జీఎస్టీ) తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం సోమవారం నుంచి అమల్లోకి వచ్చి ధరలు తగ్గాల్సివుండగా, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో చాలాచోట్ల పాత ధరలకే విక్రయాలు జరిగాయి. వాహనధరలు మినహా ఎలక్ట్రానిక్, నిత్యావసర సరుకులు పాతధరలకే విక్రయిస్తుండడంతో వినియోగదారులు వ్యాపారులను ప్రశ్నిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత నిల్వలకు పాత స్లాబులే వర్తిస్తాయని, కొత్తవి వచ్చాక ధరలు తగ్గిస్తామంటూ వ్యాపారులు జీఎస్టీ విషయంలో దాటవేత ధోరణి అవలంభిస్తుండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ 2.0లో మొత్తంగా 375 రకాల ఉత్పత్తుల ధరలు తగ్గాల్సి ఉండగా, బతుకమ్మ, దసరా పండుగ వేళ చాలా సరుకుల విషయంలో కొందరు వ్యాపారులు ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం. సంస్కరణలతో చాలా వస్తువులు సున్నా పన్ను పరిధిలోకి రావడం లేదా ఐదు శాతానికి తగ్గించడం వినియోగదారుడికి ప్రయోజనకరమే కానీ, ఈ అవకాశం కోసం ప్రజలు మరిన్ని రోజులు వేచిచూడాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు.. వ్యాపారులు. షాపింగ్ మాల్స్ వద్ద పాతరేట్లు.. జీఎస్టీ తగ్గింపుతో కొత్త రేట్ల బోర్డులు ప్రదర్శించాలి కానీ, కారు షోరూమ్‌లు మినహా మరెక్కడా కనిపించకపోవడం గమనార్హం. జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చిన రెండోజు మంగళవారం సైతం కొందరు వ్యాపారులు నిత్యావసర సరుకులు పాతధరలతోనే విక్రయించారు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌ల్లో కొందరు మాత్రమే మార్పులతో కూడిన జీఎస్టీ, సీఎస్టీ వివరాలతో బిల్లులు ఇస్తున్నారు. కొందరు పెద్ద వ్యాపారులు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. కారు షోరూమ్‌ల్లో మాత్రం జీఎస్టీ తగ్గింపు వివరాలతోపాటు ఆఫర్లు అందిస్తున్నారు. అలాగే టీవీలపై శ్లాబు 28 నుంచి 18 శాతానికి తగ్గినా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. చాలామంది వస్త్ర వ్యాపారులు బిల్లుల్లో జీఎస్టీ లేకుండానే వ్యాపారాలు సాగిస్తుండడం గమనార్హం. చిన్న దుకాణాలు, వ్యాపారులు ధరల విషయంలో తగ్గింపు లేకుండానే వస్తువులు విక్రయించారు.

పాత ధరకే ఇచ్చారు

జీఎస్టీ తగ్గింపుతో సబ్బులు, పేస్టులు, బిస్కెట్లు, షాంపూల ధరల తగ్గినట్లు వార్తల్లో చూశాం. కానీ, మాక పాత ధరల ప్రకారమే ఇచ్చారు. పాత స్టాక్ కాబట్టి ఆ రేటుకే ఇచ్చామని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు చొరవ చూపి కొనుగోలుదారుల ఇబ్బందులు తగ్గించాలి.

– వెంకటేశ్, కొనుగోలుదారుడు, వరంగల్

ప్రతీ నెలా రూ.కోట్లలోనే లబ్ధి..

శ్లాబ్ తగ్గింపుతో వినియోగదారులకు మేలు జరగనుండగా జీఎస్టీ పరిధిలోకి రాకుండా వ్యాపారాలు సాగించే వారి విషయంలో వాణిజ్య శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలి. ఇప్పటికీ చాలా మంది రూ.20 లక్షలకుపైగా లావాదేవీలను జరుపుతున్నా, జీఎస్టీ పరిధిలోకి రావడం లేదు. దీంతో వినియోగదారుడికి ఆర్థికంగా నష్టం కలగడంతోపాటు ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. 2017 జులై 1న జీఎస్టీ అమల్లో వచ్చే నాటికి వరంగల్, హనుమకొండ జిల్లాలో పది వేల మందికి పైగా డీలర్లున్నారు. వీరంతా ప్రొవిజనల్ ఐడీలు ముందుగా పొంది తర్వాత జీఎస్టీ సంఖ్య అందుకున్నారు. కాలక్రమేణా జీఎస్టీ పరిధిలోకి వ్యాపారుల సంఖ్య పెరిగింది. ఏటా రూ.20 లక్షలకుపైగా ఆదాయం ఉన్నవారంతా విధిగా తీసుకోవాల్సి ఉండడంతో మొత్తంగా 15 వేలకుపైగా మంది వ్యాపారులు జీఎస్టీ సంఖ్య పొందారు. అయితే ప్రభుత్వం నుంచి మరిన్ని మార్గదర్శకాలు వచ్చిన తర్వాతనే ధరలు తగ్గించే అవకాశం ఉంది. ఈ విషయంపై వచ్చే నెలలోనే పూర్తి స్థాయిలో స్పష్టత రానుంది. జీఎస్టీ తగ్గింపుతో జిల్లాల్లో నెలకు రూ.10 కోట్లకుపైగా వినియోగదారులకు ప్రయోజనం కలిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు.

ముస్లింలను మోసం చేస్తున్న కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న నయీముద్దీన్

న్యూశాయంపేట : పథకాల పేరుతో ముస్లిం మైనారిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ నయీముద్దీన్ ఆరోపించారు. మంగళవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంటరి, వితంతువు మహిళలకు రూ.50 వేల ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించినా దరఖాస్తు గడువు చూస్తే ఎన్నికల్లో లబ్ధికోసం ప్రకటించినట్లుగా అనుమానం వస్తుందన్నారు. సమావేశంలో సర్దార్ అలీ, మహ్మద్ ఇక్బాల్, రషత్, సమ్దానీ, తస్లీమ్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు సన్మానం

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్య (డిగ్రీ కళాశాలల) ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.చిన్న, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డి.వెంకన్న, కేయూ కోఆర్డినేటర్ డి. రామకృష్ణారెడ్డి, వివిధ జిల్లాల బాధ్యులు ఎం.రవికుమార్, యాకూబ్, ఎం.రవీందర్, ఎ.వెంకటరమణ, శ్యాంప్రసాద్, బి.రమేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి'

ఎంజీఎం : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్యులపై జరిగిన దాడిని తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) వరంగల్ శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ దిలీప్‌కుమార్, నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు 24 గంటలు నిరంతరం సేవలందించే వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పై దాడులకు పాల్పడటం అమానవీయ చర్య అని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి దా డులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు



పాట పాడుతున్న కథానాయకుడు అంకిత్

హన్మకొండ: విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దని బ్యూటీ చిత్రం కథానాయకుడు అంకిత్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలో బ్యూటీ చిత్రం కథానాయకుడు అంకిత్, కథనాయిక నిలాఖీ పాత్ర సందడి చేశారు. షైన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో వారు పాల్గొన్నారు. విద్యార్థులు సెల్ఫీ దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా అంకిత్ కన్నమ్మ.. కన్నమ్మ పాట పాడి విద్యార్థుల్లో జోష్ నింపారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని హితబోధ చేశారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి వ్యసనం కావొద్దని సూచించారు. కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనస్ డబ్బులు ఖాతాలో జమ చేయాలి

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్

వరంగల్ చౌరస్తా : రైతాంగం గత యాసంగిలో పండించిన వరి ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్ నేటికీ రైతుల ఖాతాలో జమ చేయకపోవడం అన్యాయమని తక్షణమే జమ చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని ఓంకార్ భవన్‌లో ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకొని భూమి కౌలుకు తీసుకొని అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంటలు తీస్తున్నారని, సరైన ధర రాక ఆర్థికంగా చితికిపోతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబురావు, కోశాధికారి మల్లికార్జున్, జిల్లా సహాయ కార్యదర్శి రామచందర్, జిల్లా నాయకులు సురేందర్, ఐలోని, వెంకటయ్య, జనార్ధన్, కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్

ముదిరాజ్‌లను బీసీ–ఏ లోకి మార్చాలి

- 'మెపా' వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్

హన్మకొండ : ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ఏ లోకి మారుస్తామని చెప్పిన హామీ ఏమైందని సీఎం రేవంత్ రెడ్డిని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలోని 'మెపా' కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముదిరాజ్‌లు అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ముదిరాజ్‌లను బీసీ–ఏ లోకి మార్చాలని వినతి పత్రం ఇవ్వగా స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్, రాష్ట్ర గౌరవ సలహాదారుడు పులి ప్రభాకర్ , పొన్నం రాజు, నీరటి రాజు, కోటేశ్వర్ రావు, నరేష్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

బీజేపీ నాయకుల సంబురాలు



డీ మార్ట్ వద్ద సరుకులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వరంగల్ చౌరస్తా/ఖిలావరంగల్ : ప్రధాని మోదీ దసరా కానుకగా జీఎస్టీ తగ్గింపు చారిత్రాత్మక నిర్ణయమని, పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతగానో మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. వరంగల్–నర్సంపేట రోడ్డులోని డీ మార్ట్ తదితర ప్రాంతాల్లో ప్రజలు కొనుగోలు చేసిన సరుకులను, వాహనాల పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. వరంగల్ లోని ప్రైవేట్ కంపెనీకి చెందిన కార్పొరేట్ షాపులను సందర్శించి వారు సందర్శించి జీఎస్టి తగ్గుంపుతో పేదల ప్రజలు కొనుగోళ్లు చేసిన పరికరాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జీఎస్టీ అభియాన్ జిల్లా కన్వీనర్ రత్నం సతీష్ షా, కో కన్వీనర్ కుచన క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, సీనియర్ నాయకులు పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ అలంకరణలో భద్రకాళి



హన్మకొండ కల్చరల్ : మకరవాహనంపై ఉన్న అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కాజీపేట: గాయత్రి దేవిగా దుర్గామాత



ఖిలావరంగల్ : బ్రహ్మచారిణి రూపంలో శ్రీలలితాదేవి

హన్మకొండ కల్చరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం భద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు చండీహోమం నిర్వహించారు. ఉదయం బ్రహ్మచారిణి క్రమంలో పూజలు జరిపి మకరవాహనంపై, సాయంత్రం దేవజా క్రమంలో పూజలు జరిపి చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గాయత్రిదేవిగా దుర్గామాత

కాజీపేట : మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో దుర్గామాతను అర్చకులు గాయత్రి మాతగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గులాబీ రంగు చీరతో అలంకరణ చేసి కొబ్బరి అన్నంతో నైవేద్యం సమర్పించారు.

శివనగర్‌లో..

ఖిలా వరంగల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం వరంగల్ శివనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీలలితాదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలలితాదేవి స్థానిక భక్తులకు బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించుకున్నారు. విద్యార్థినులు, ఆశ్రమ సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మ పేర్చారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి పాల్గొని మాట్లాడారు.

ఖిలా వరంగల్: తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ బంగారు బతుకమ్మను భావి తరాలకు అందించాలని కోరుతూ మంగళవారం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కమల్ యాదవ్, కరీమాబాద్‌లోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

'న్యూసైన్స్'లో

హన్మకొండ అర్బన్ : నగరంలోని హంటర్‌రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాళ్లు రాజేశం, కమలాకర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆడపడుచులు గొప్ప వేడుకగా నిర్వహించుకునే పండుగ బతుకమ్మ అని, మన సంస్కృతి సంప్రదాయాలల్లో భాగంగా ప్రకృతితో నిర్వహించే పండుగని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ శ్రవణ్, మధుకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు, పీడీ రాజేష్, పాల్గొన్నారు.

రాధా కృష్ణ గార్డెన్‌లో..

వరంగల్ చౌరస్తా : వరంగల్ స్టేషన్ రోడ్డులోని రాధాకృష్ణ గార్డెన్‌లో ఆర్యవైశ్య మహా సభ మహిళ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. కోలాటం, నృత్యాలు చేస్తూ, గేయాలు ఆలపించారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో మహా సభ జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్, రాష్ట్ర మహిళా విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ సామ్రాజ్యలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి వంగేటిఅశోక్ కుమార్,, జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, కోశాధికారి శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.



హన్మకొండ : స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో బతుకమ్మ సంబురాలు



వరంగల్ చౌరస్తా: రాధాకృష్ణ గార్డెన్‌లో..



ఖిలావరంగల్: న్యూ కౌటిల్యాస్ హైస్కూల్‌లో..



హన్మకొండ అర్బన్ : బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్